

# పరిస్థితులు

## కాకాని కమల

'మణ్యం గారూ..'

తన ఇంటి ముంగిట అరుగుమీద కూర్చుని ఒక చేతిలో తెల్లకాగితం పెన్ను మరో చేతిలో పంచాంగం పట్టుకుని ఏవో లెక్కలు గుణిస్తున్న సుబ్రహ్మణ్యం పుస్తకంలోంచి తలయెత్తాడు.

ఎదురుగా రమణయ్య రెండు చేతులు జోడించాడు.

'నేనే మణ్యంగారు! మా అమ్మాయిని ఆ లక్ష్మీ ఫైనాన్స్ కంపెనీ రఘుపతిగారబ్బాయి ఇంజనీర్ చంద్రకాంత్ పెళ్ళి చూపులు చూసుకెళ్ళి నెల దాటుతోంది. వాళ్ళనుంచి ఇంతవరకు ఏవిధమైన సమాచారం లేదు. పోనీ మళ్ళీ మీరు మా ఇంటిదిక్కు రాలేదు. ఈ సంబంధం విషయంలో మొదట్నుంచి మధ్యవర్తిత్వం చేస్తున్నది మీరే కనుక ఏ సంగతి తెలుసుకుందామని ఇటు వచ్చాను. మణ్యంగారూ...'

చేతిలో పంచాంగం పక్కన పెట్టి చిరునవ్వు నవ్వాడు మణ్యం.

'కూర్చోండి రమణయ్య గారు. ఇవాళా రేపో నేనే వద్దాం అనుకుంటున్నాను. కాస్త అర్జంటు పని వుండి అశ్రద్ధ చేశాను'

'నిజమే అనుకోండి. కానీ ఆడపిల్ల వాళ్ళం. మాకు తొందర వుంటుంది కదా?'

సుబ్రహ్మణ్యం చూపుడు వేలును ముక్కుపై ఆన్చుకున్నాడు.


'ఎంతమాట? నాకు తెలియదా? నేనూ ఆడపిల్లలు గలవాడ్నే. మీకు ఇద్దరే. నాకు నలుగురు పెళ్ళికావలసిన ఆడపిల్లలున్నారు. మీ తొందర నాకు తెలుసు రమణయ్యగారు'.

రమణయ్య ముఖంలో సంతృప్తి కదిలింది.

'తమ దయ.. ఇంతకీ వాళ్ళు.. మా అమ్మాయి గురించి ఏమన్నారు? నచ్చిందన్నారా? లేక?..'

'ఆ సంశయమే మీకు అనవసరం. మీ అమ్మాయి నచ్చింది. మీ సంప్రదాయం నచ్చింది. వాళ్ళు సుముఖంగానే వున్నారు'

## ☆ గురజాడ వీధి




**పాపభీతికి, మంచితనానికీ మధ్య బతికే మనుషుల్ని పరిస్థితులు ఆడిస్తే చివరికి ఓటమి ఎవరికి?**

మణ్యంగారు చిరునవ్వుతో మామూలుగానే ఆ మాట చెప్పినా వెయ్యి ఫిరంగులు ఒక్కసారి పేలి నట్టు రమణయ్య ముఖంలో ఒక వింత మెరుపు గభాల్న ఒరిగి మణ్యంగారి రెండు చేతులూ పట్టు కుని 'ఎంత శుభవార్త చెప్పారు మంయంగారు. మీరు చెప్పేది...'

'అక్షరాలా నిజం. మీ సంబంధం వాళ్ళు ఇష్టప డుతున్నారు.. మీదే ఆలస్యం..'

'మరి వరకట్నం కానుకలు..'

'తమరికి ముందే చెప్పాను కదా రమణయ్య గారు.. వాళ్ళకు వీటిపై అంతగా పట్టింపులు గొంతెమ్మ కోరికలు లేవు. వాళ్ళకి చంద్రకాంత్ ఒక్కగానొక్క కొడుకు. ఇంజనీరు. విదేశాల్లో చదువుకుని వచ్చాడు. మళ్ళీ తొందర్లోనే ఉద్యో గనిమిత్తం అమెరికా వెడుతున్నాడు. అమ్మాయి అందంగా సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చి నదై వుండాలన్నదే వాళ్ళ అభిరుచి. వాళ్ళకి మీ అమ్మాయి నచ్చింది. మిమ్మల్ని వెంట పెట్టుకుని రమ్మని కూడా చెప్పారు.'

పాలపొంగే అయ్యింది రమణయ్య మనసు.

'ఎంత చల్లటి వార్త చెప్పారు, అయితే మంచి రోజు ఎప్పుడో చూడండి. మనిద్దరం వెళ్ళి మిగతా విషయాలు మాట్లాడుకుని వద్దాం' తొందరచేశాడు రమణయ్య.

'...' మంయంగారు రెండు నిమిషాలు కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తున్నట్టు అంతర్ముఖుడై తిరిగి కళ్ళు తెరిచాడు. నిదానంగా రమణయ్యను చూస్తూ అన్నాడు.

'రమణయ్యగారు..'

రమణయ్య గారు కంగారు పడ్డాడు. 'చెప్పండి. ఎందుకా సందేహం?'

'సందేహం కాదు. ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు'

'అంటే? నా శక్తికి మించి..'

'అబ్బెబ్బే. వాళ్ళు అసలు డబ్బు మాటే ఎత్తడం లేదు. అబ్బాయి అమెరికాలో చదువుకుని వచ్చాడు కదా? మొదట్నుంచి వాళ్ళు ఆధునికంగానే వున్నారు. పెట్టుపోతలు మీ శక్తికొద్దీ జరిపించవచ్చు.'

'మరింకేమిటి సుబ్రమణ్యం గారు..'

'...' మళ్ళీ కొద్ది సేపు మణ్యంగారు అంత ర్ముఖుడై కళ్ళు మూసుకుని తెరిచాడు. స్థిరమైన గొంతుకతో ఇలా అన్నాడు.

'రమణయ్యగారు! నే చెప్పే విషయం స్థిమితంగా వినండి. మీరు చాలాకాలంగా నాకు తెలిసిన వారు కనుక ఒక నిజం మీకు చెప్పాలని ఆరాట పడుతున్నాను. కానీ అలా చెప్పడం పొరపాటేనని మళ్ళీ వెనకాడుతున్నాను'

'ఎంతమాట మణ్యంగారు! మీరు పొరపాటు మాట్లాడతారా? మరు చెప్పేది ఎలాంటిదైనా సరే నేను వింటాను. నేను కోరుకునేది నా కూతురి క్షేమం..'

'అవును కదా? అందుకే చెబుతున్నాను. ఇప్పుడు నేను చెప్పే విషయాలు దయచేసి పెదవి దాటనీయని ముందుగా నాకు మాట ఇవ్వండి'

'తప్పకుండా.. ముందా విషయం చెప్పండి'

'పెళ్ళికొడుకు చంద్రకాంత్ తల్లిదండ్రులకు ఒక్క గానొక్క కొడుకు. బోల్డంత వుంది. విదే శాలకి వెడుతున్నాడు. అక్కడ ఉద్యోగం అంటూ ఇంకా సంపాదించుకుంటాడు. కాని అతని జాతకం బొత్తిగా బాగుండలేదని విన్నాను.'

'అలాగా? అయినా జాతకంతో ఏం బాగుండా లండి? మంచి చదువు ఉద్యోగం, ఆస్తి..'

'ముందు నేను అలాగే అనుకున్నాను. ఇప్పుడు అతనికి ఇరవై ఆరేళ్ళు. అతని ముప్పై నాలుగవ యేట నుంచి అతని జాతకం అసలు బాగుండ లేదట. మనకిచ్చిన జాతకం తప్పుడు జాతకంట. లోపాయికారి జరిగిందని విన్నాను'

'అంటే?'

'నే విన్నది ఎంతవరకు నిజమో నాకు తెలి

'యదు. కానీ నా చెవిన పడిన విషయం మీ చెవిన వెయ్యడం నా ధర్మం కాదా? ఎందుకంటే నాకూ ఆడపిల్లలున్నారు' ఆఖరి వాక్యం కాస్త ఆవేదనగా వత్తి పలికాడు సుబ్రహ్మణ్యం.

'ఫరవాలేదు. చెప్పండి. ఏం చెప్పారు?'

'అబ్బాయి పుట్టిన అసలు సమయం, తిథి ప్రకారం చూస్తే జాతకంలో చాలా లోపం ఉందట. అర్థాయుష్కుడట. అసలు అతని జాతకం ప్రకారం పెళ్ళియోగం లేదని వుందిట. అందుకని కొడుకు జీవితం దెబ్బతినకుండా పుట్టిన ఘడియలు మార్చి జాతకం తిరిగి రాయించారు. అసలు జాతకం దాచిపెట్టి మనకి ఈ పెట్టుడు జాతకం చూపిస్తున్నారట'

'శివ శివా..' చెవులు మూసుకున్నాడు రమణయ్య.

'అంతేనా? ఇంకా వినండి. ఆ అబ్బాయి మూడేళ్ళు అమెరికాలో చదువుకున్నాడు కదా? ఆ సమయంలో అక్కడే తనతో చదువుకునే 'ఎలిజా' అనే ఇంగ్లీష్ పిల్లని పెళ్ళి చేసుకున్నాడట. కాపురం కూడా పెట్టాడుట. కాని ఆ విషయం ఆరాయించుకోలేక తల్లిదండ్రులు చంద్రకాంత్ జాతకంలో ఏదన్నాలోపం వున్న ఈ పెళ్ళితోనే కొట్టుకుపోతుందని తలచి ఆ పెళ్ళి రద్దుచేయించి ఆ ఎలిజాకి విడాకులు ఇప్పించారట. ఇక్కడ మన సంప్రదాయం ప్రకారం జాతకురాల్ని చూసి పెళ్ళి చేసి పంపిస్తున్నారట. ఆ ఇంగ్లీష్ వాళ్ళకి పెళ్ళి–విడాకులకు పెద్దగా పట్టింపులు లేవు కనుక అక్కడ గొడవలు ఏం జరగలేదట'

రమణయ్య నొసలు చిట్లించాడు.

'ఇవన్నీ మీకెలా తెలిసాయి'

'అదీ చెప్తున్నా వినండి. ఆ మధ్య ఉత్సవాలకి నేను విజయవాడ వెళ్ళాను కదా? ఈ రఘుపతి గారి దూరపు బంధువు ఒకాయన కలిసి ఈ విషయాలన్నీ నాకు చెప్పాడు. ఒరి నుంచి రాగానే మిమ్మల్ని కలుస్తానని చెప్పాను. కాని కలవలేదు. ఇందుకే..'

రమణయ్య అనుమానంగా అన్నాడు. 'మీకు చెప్పిన ఆయన గిట్టక ఈర్ష్యకొద్దీ అలా చెప్పి వుండొచ్చు కదా?'


గురజాడ వీధి శీర్షికలో
వచ్చే సంచికలో



'సలీం'కథ
స్వర్ణభారతి


'ఆ ఆలోచన నాకూ వచ్చింది రమణయ్యగారు. అందుకే నేను తటస్థంగా వుండిపోయాను. విన్న విషయం ఎంతవరకు నిజమో నాకు తెలియదు. చెప్పాలో చెప్పకూడదో తోచలేదు. ఆపైన మీ ఇష్టం. నిర్ణయం మీకే ఒదిలి పెడుతున్నాను. ఆలోచించుకోండి. కాని దయవుంచి ఎక్కడా నోరు జారవద్దు' ప్రాధేయపడ్డాడు సుబ్రహ్మణ్యం.

'మీకా భయం అక్కర్లేదు మంయం గారు. కాని నిప్పు లేకుండా పొగ వస్తుందంటారా?'

'అదే కదా నా సందేహం. అందాకా ఏమన్నాకాని య్యమని మీ చెవిన వేశాను' పాలపొంగుమీద నీళ్ళు చల్లినట్టు తగ్గిపోయాడు రమణయ్య. నిండు జాబిల్లిమీద నల్లమబ్బు కమ్మినట్టు ఆయన ముఖం వన్నె తగ్గింది.

తనలో తను గొణుక్కుంటున్నట్టు అన్నాడు రమణయ్య. 'ఇంత విన్నాక ఏమని పిల్లనిస్తాం? అంత్య నిష్ఠూరం కంటె ఆది నిష్ఠూరం మేలు. అలాంటి గొప్ప సంబంధం మనకెందుకు లెండి. ఇటువంటి సంబంధం చేస్తే అదేం సుఖపడుతుంది? నేనేం నిశ్చింత పడగల్ను? మాకు తగిన వాడు దొరికి అయినప్పుడే దాని పెళ్ళి అవుతుంది'

వెయ్యి లంఖణాలు చేసి ఖాయిలా పడిన వాడిలా ఇంటికి వచ్చాడు రమణయ్య.

నిరాశగా వెళ్ళిపోతున్న రమణయ్యని చూసిన సుబ్రహ్మణ్యం మనసు వెయ్యి కత్తులు గుచ్చుకొన్నట్టు విలవిల్లాడిపోయింది.

'ఇలా చెప్పకుండా వుండవలిసంది. పాపం మూటకట్టుకుంటున్నానేమో..' అనుకుంటూ గబగబ పెరట్లోకి వెళ్ళి బావిలోంచి నీళ్ళు చేది కాళ్ళు చేతులు కడుక్కుని దేవుడి గదిలోకి వచ్చి గాయత్రీ అమ్మవారి మందిరం ముందు మోకరిల్లి 'అపరాధిని మన్నించు తల్లి' అని లెంపలేసుకుని వేడుకున్నాడు.

రమణయ్య పెద్దకూతురి పెళ్ళి సంబంధం కోసం కాళ్ళు అరిగేలా తిరుగుతూనే వున్నాడు. అయిన వాళ్ళకి కాని వాళ్ళకి చెబుతూనే వున్నాడు. మ్యారేజి బ్యూరోల్లో కూడా రిజిస్టరు చేశాడు. అంతకుముందు ఒదులుకున్న ఇంజనీర్ చంద్రకాంత్‌కి కూడా ఇంకా పెళ్ళి కాలేదు. ఇంకో నాలుగు నెలల్లో ఆ అబ్బాయి నచ్చిన పిల్లను చేసుకుని అమెరికా వెళ్ళిపోతాడని, ఆడపిల్ల తండ్రులు వాళ్ళ ఇంటిచుట్టూ తిరుగుతున్నారని వింటూనే వున్నాడు.

రమంయ్య మనసు పీకుతుంది.

బంగారం లాంటి సంబంధం మూఢనమ్మకాలతో, గాలివుకార్లతో చేజార్చుకుంటున్నానేమో అని గుంజాటన పడుతున్నాడు. అసలు కొంతమంది ఈ జాతకాలనే నమ్మరు కదా? అని తర్కించుకుంటున్నాడు.

'ఇన్ని అనుమానాలతో శంకలతో ఎందుకు లెండి.


డాక్టర్ కేశవరెడ్డి 'చివరి గుడిసె'
కుప్పిలి పద్మ 'అహల్య'
వసంతరావు దేశ్‌పాండే 'అడవి'

నవలల్లో నవచైతన్యం...
వచ్చేవారం

ఆ సంబంధం గురించి మర్చిపోదాం. మనకి ప్రాప్తం లేదు' అంది భార్య.

సుడి లేకపోయినా ఫరవాలేదు. కాని ఆడదానికి సౌభాగ్యం లేకపోతే బతుకు వెళ్ళమారదను. ఒకవేళ ఆ అబ్బాయి జాతకం నిజమే అయితే మన అమ్మాయి గతేమిటి? తెలిసి దాని గొంతు కోసినట్టే కదా? అని కూడా అంది.

అందుకే మిన్నకుండి పోయాడు రమణయ్య.

చూస్తూ వుండగానే మరో రెండు నెలలు గడిచాయి.

ఆరోజు మధ్యాహ్నం రెండు అవుతుంది సమయం. ఆఫీసులో అంత 'లంచ్'కి బయలుదేరబోతున్నారు.

రిసెప్షన్లో సందడి కనిపించింది. స్టాఫంతా అక్కడ చేరుతున్నారు.

ఫారెస్టు కంట్రాక్టరు వెంకటాద్రి వెలిగిపోతూ సిల్కులాల్చి, తెల్లటి పాలిస్టర్ పంచె, మెడలో గొలుసు, చేతికి బంగారు చెయిను, వేళ్ళనిండా ఉంగరాలు.. చిన్న జమిందారులా లోపలికి వచ్చాడు. ఆయన వెనకాలే అసిస్టెంట్ చేతినిండా స్వీట్ పాకెట్లు పట్టుకున్నాడు.

'ఏమిటీ విశేషం వెంకటాద్రి గారూ'

'విశేషమేముందీ అంత స్వీట్స్ తీసుకోండి. నా ఒక్కగానొక్క కూతురు నాగవల్లి పెళ్ళి కుదిరింది. వచ్చే నెల ఆరవ తారీఖున. మీరంతా కుటుంబ సమేతంగా తప్పక రావాలి' అంటూ జిప్‌బ్యాగ్ తెరిచి పెళ్ళిశుభలేఖలు అందరికీ ఇస్తూ రమణయ్య సీటు దగ్గరకు కూడా వచ్చాడు.

'రమణయ్య గారూ! తప్పక రావాలి. అన్నట్టు మీ పెద్దమ్మాయికి కూడా సంబంధాలు చూస్తున్నారని విన్నాను. ఏదన్నా కుదిరిందా? మీ విజయ మా నాగవల్లి ఈడుదేగా?'

'అవును వెంకటాద్రి గారు. ఇంకా మా పిల్లకి ఏదీ కుదరలేదు. మీరంటే శ్రీమంతులు. ఏదన్నా సాధించుకుంటారు. కానీ నా స్థోమతుకు తగిన సంబంధం కుదరాలి కదా?'

'ఎందుకు కుదరదు? ఆ బ్రహ్మ ఎక్కడో రాసే వుంటాడు. మనం వెదుక్కోవాలి. అసలు మనిషి దొరికేదాకా ఇలాగే ఆలస్యం అవుతుంది. మీ ప్రయత్నం మీరు చెయ్యండి. ముందు ఈ స్వీట్ తీసుకోండి' రమణయ్య ఒక కోవా కేకు ముక్క తీసుకుని నోట్లో వేసుకున్నాడు.

'ఇంతకీ మీ అల్లుడు ఏం చేస్తాడు?' అన్నాడు శుభలేఖ అందుకుంటూ.

'మా అల్లుడికేం బంగారం అనుకోండి. అమెరికా ఇంజనీర్ చంద్రకాంత్. అదే ఆ లక్ష్మి ఫైనాన్స్ కంపెనీ రఘుపతిగారబ్బాయి. అమెరికాలో చదువాడు. అక్కడే ఉద్యోగం వచ్చిందట. పెళ్ళిచేసుకుని వెంటనే భార్యతో వెళ్ళిపోతాడట. మా నాగవల్లి చిన్నప్పట్నుంచి జాతకురాలు. అందుకే అమెరికా మొగుణ్ణి సంపాయించుకొంది'

వెంకటాద్రి గర్వంగా చెబుతుంటే శుభలేఖ తెరుస్తున్న రమణయ్య చేతులు వణికాయి. ఏదో అందామని నోరు తెరిచాడు. కానీ మాట పెగల్లేదు. అవాక్కుగా అయిపోయాడు.

బంగారం లాంటి అల్లుడిని వెంకటాద్రి దక్కించుకున్నందు ఒక పక్క ఏదో అలజడి.. మరోపక్క ఏదో తెలియని బాధ.. ఒక్కుమ్మడిగా రమణయ్య గుండెని ఆపినంత పనిచేశాయి. మళ్ళీ అంతలోనే వెంకటాద్రి అన్నాడు.

'పెళ్ళిళ్ళ పేరయ్య మణ్యంగారు.. అదే సుబ్రహ్మణ్యం గారని ఆ కోవెల వీధిలో వుంటాడే ఆయనే మాకీ సంబంధం కుదిర్చి పెట్టాడు. ఆ చంద్రకాంత్‌కి చాలా మంచి సంబంధాలు వచ్చాయట. కానీ మాకు కుదిర్చిన ఘనత మాత్రం మణ్యం గారిదే. నాకు ఎప్పట్నుంచో ఆ చంద్రకాంత్‌ని అల్లుడ్నిగా చేసుకోవాలని నా కూతుర్ని అమెరికా పంపించాలని తాపత్రయం పట్టుకుంది. నేను అడిగితే వాళ్ళు ఏమంటారోనని సందేహపడ్డాను. అందుకే ఆ కుటుంబానికి మొదట్నుంచి సన్నిహితుడుగా వున్న మణ్యంగార్ని ఆశ్రయించాము. ఆయన ఈ పెళ్ళి కుదిర్చి పుణ్యం కట్టుకున్నారు?'

'అలాగా?' రమణయ్య నోరు తెరిచాడు.

'అవును. కట్నకానుకల పట్ల పెద్దగా రఘుపతి గారికి ఆశలేదన్ని అన్నారు. కానీ నాకున్నది ఒక్క కూతురే. వాళ్ళు వద్దనా తక్కువ చేస్తానా? నా సంపాదనంతా కాస్త ముందు వెనుకగా నా కూతురు నాగమల్లికే. మణ్యంగారి ఋణం కూడా నేను వుంచుకోలేగా లెండి. ఆయన పెద్దకూతురికి పెళ్ళి కుదిరిందట. డబ్బు సర్దుబాటు లేక ఆలోచిస్తున్నాడని విన్నాను. ఆ ఖర్చు సంగతి నేను చూసుకుని ఏదో ఏర్పాటు చేస్తానని ముహూర్తాలు పెట్టుకోమని చెప్పాను. అందుకే మాకీ సంబంధం చిటికెలో కుదిర్చి పెట్టాడు. ఎలా మధ్యవర్తిత్వం చేస్తాడో తెలియదు కాని మహా ఘటికుడు. మీరు కూడా ఆయన్ని కలవండి. రమణయ్యగారు..' సలహా చెబుతూనే వెంకటాద్రి ఆఫీసంతా కలయతిరిగుతూ శుభలేఖలు, మిఠాయిలు పంచుతున్నాడు.

'ఆ అబ్బాయి నష్టజాతకుడు, అల్పాయుష్కుడు. పెళ్ళి కల్సిరాదట. అందుకని జాతకం తారుమారుచేశారట' మణ్యం గారి మాటలు మనసులో కదలుతుంటే అసహనంగా తల విదిల్చుకున్నాడు రమణయ్య.

పెళ్ళి చూపుల సమయంలో స్వర్గం చూపించిన మణ్యం గారు తీరా ఆ తంతు పూర్తయ్యాక ముఖం ఎందుకు చాటు వేశాడో కాలాతీతం ఎందుకు చేశాడో అర్థం అయ్యింది.

'నష్టజాతకుడు ఆ చంద్రకాంత్ కాదు నేను. నా కూతురు నష్టజాతకులం' అనుకున్నాడు వేదనగా మునివేళ్ళతో కంతలు నొక్కుకుంటూ రమణయ్య.

ప్రతి మనిషిలో అంతో ఇంతో మంచితనం పాపభీతి వుంటుంది. కాని పరిస్థితులు చెడ్డవి.



బూట్లు

వలభైయ్యేవ పడిలోకి వచ్చినా ఇంకా కుర్రతనం పోనట్లు కనిపించే అనిల్ కపూర్‌కు ఈ మధ్య బూట్ల పిచ్చి పట్టుకుంది. ఎక్కడ బూట్లషాపు కనబడితే అందులోకి దూరతాడట అనిల్ కపూర్ బూట్ల బాధ పడలేకపోతున్నారట తోటిజనం


# మీ తల ఒక రాతిబండ కాదుకదా !

అన్ని కెమికల్ షాంపూలు
మీ తలకు పట్టిస్తే ఎలా ?




మృదువైన మీ చర్మాన్ని శిరోజాలని
కెమికల్స్‌తో బాధించకండి.
షాంపూలయినా, సాధారణ హెర్బల్
పౌడర్‌లయినా ఒకటే. అందుకే
మీ శిరోజాలకు, చర్మ సంరక్షణకు
కావాలి, సహజ వనమూలికల
సద్గుణ సమ్మేళనం - ధరణి
ఇందులో వుంది శ్రేష్ఠమైన
సపిండస్ ట్రిపోలియాటిస్.

DHARANI
FILM
INDUSTRY
ప్రతి శుక్రవారము రా. గం. 7.00 లకు
ప్రతి సోమవారము మ. గం. 12.30 లకు
జెమిని టి.వి.లో ప్రసారం

రూ. 2 లక్షలు బంగారు
బహుమతులు గెలుచుకోండి.
1-12-1997 నుండి 31-3-1998 వరకు

## ధరణి

* హెర్బల్‌పౌడర్ * ఆర్గానిక్ పౌడర్

Mktg. Office : Dharani Forestry & Orchards Limited.
Secunderabad - 500 080, A.P. Ph: 040-7530175 Fax : 040-7530175
గమనిక: కూపన్స్ లేని స్టాక్ కూడా మార్కెట్‌లో కలదు.

First Time in India FARM TO HOME Eco-Friendly Herbal Powder

PROGRES